

అనారోగ్యంతో ఉపాధ్యాయిని మృతి



శెట్టి రమణమ్మ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని అరకు పంచాయతీ కేంద్రంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో విధులు చేపడుతున్న శెట్టి రమణమ్మ అనే ఉపాధ్యాయిని మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు.కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమణమ్మకు మంగళవారం ఆరోగ్యం మరింత విషమంగా మారి ఆసుపత్రిలోనే మృతి చెందిందని బాధిత కుటుంబీకులు తెలిపారు. రమణమ్మ అకాల మరణానికి మండలంలోని యుటిఎఫ్, పిఆర్‌టియు ఉపాధ్యాయుల సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సంతాపాన్ని ప్రకటించారు.

తీరు మారని వైద్యం!

- మరణాలు చోటుచేసుకుంటున్నా వీడని నిర్లక్ష్యం
- స్థాయి పెరిగిన తర్వాత వైద్యసేవలు మృగ్యం
- ఇద్దరు వైద్యులున్నపుడే నయమంటున్న రోగులు
- ఇదీ చింతపల్లి వంద పడకల ఆసుపత్రి దుస్థితి



చింతపల్లి వంద పడకల ఆసుపత్రి


ప్రజాశక్తి- చింతపల్లి :చింతపల్లి, జికె.వీధి మండలాలకు పెద్ద దిక్కుగా ఉన్న చింతపల్లిలోని వంద పడకల ఏరియా ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్య వైఖరితో చెడ్డపేరు మూట కట్టుకుంటుంది. నాడు ఇద్దరు వైద్యులున్నా మెరుగైన వైద్యం అందే ఈ ఆసుపత్రిలో, నేడు స్థాయి పెరగడంతోపాటు వైద్యులు సంఖ్య పదికి చేరుకున్నా సరైన వైద్యం అందని పరిస్థితి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 30 పడకల సామాజిక ఆసుపత్రిగా ఉన్నపుడు చింతపల్లి, జికె.వీధి మండలాల పరిధిలోని 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు చింతపల్లి సామాజిక ఆసుపత్రిగా ఏర్పాటైన తర్వాత 30 పడకలతో కరోనా సమయంలో డాక్టర్ మహేష్, డాక్టర్ రఘురాం నాడు ఇద్దరే వైద్యులు ఎటువంటి మరణాలకు ఆస్కారం లేకుండా ఎంతో సమర్థవంతమైన సేవలు అందించారు.

కానీ ప్రస్తుతం చింతపల్లి ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచడంతోపాటు .పదిమంది వైద్యులను, అదనపు వైద్య సిబ్బందిని నియమించడంతో పాటు వైద్యపరికరాలను సమకూర్చారు. అయితే ఇక్కడ విధులు నిర్వహించే నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్య వైఖరి పుణ్యమని ఆసుపత్రికి వచ్చే రోగులు, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు సరైన వైద్యం అందడం లేదని, ఆసుపత్రికి వైద్యానికి రావాలంటే గిరిజనం భీతిల్లుతున్నారు. మానవత, సేవాదృక్పథంలో సేవలు అందించాల్సిన వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగులతోపాటు అధికార కూటమిపార్టీలు, ఇతర పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. ఇద్దరు డాక్టర్లు ఉన్నప్పుడే జ్వరాలు, మాతా శిశు మరణాలను నియంత్రించడంతోపాటు కరోనా మరణాలను సైతం నియంత్రించిన పరిస్థితి ఉన్న ఈ ఆసుపత్రిలో, నేడు లెక్కకు మిక్కిలిగా వైద్యులు, సిబ్బందితోపాటు ఆధునిక వైద్యపరికరాలు సమకూరినా, సేవల్లో నిర్లక్ష్యం వల్ల మరణాలు చోటుచేసుకోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. తాజాగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం ముందురోజున ప్రసవ వేదనతో ఆసుపత్రికి వచ్చిన గర్భిణికి సకాలంలో సరైన వైద్యం అందించే వైద్యనిపుణులు అందుబాటులో లేని పరిస్థితులో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించే లోపు గర్భంలోని శిశువు, అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించే లోపు ఏకంగా గర్భిణి మృతి చెందిన ఘటన ఇక్కడ వైద్యసేవల్లో నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని మన్యవాసులతోపాటు అన్ని రాజకీయపక్షాల నేతలు మండిపడుతున్నారు.

మాతాశిశుమరణాలతో దీని సెగ రాజధానికి చేరడంతో వైద్యఆరోగ్యశాఖ రాష్ట్ర మంత్రి ఆదేశాల మేరకు వైద్యశాఖ జాయింట్ కమిషనర్ రమేష్‌కిషోర్ సోమవారం రాత్రి చింతపల్లి ఆసుపత్రిలో బాధిత కుటుంబాన్ని, ఆసుపత్రిలో ఉన్న రోగులను విచారించారు. సూపరిండెండెంట్ చంద్రశేఖరరావుపై వేటువేసి, ఆ స్థానంలో మరో వైద్యాధికారిని డాక్టర్ ప్రభావతికి చోటు కల్పించారు. ఇక్కడి వైద్యులు, సిబ్బంది సేవల్లో నిర్లక్ష్యం వల్ల ఈ ఘటన వరకు సూపరెంటిండెంట్‌ను బాధ్యుడిని చేశారనే ఆరోపణలున్నాయి. దీంతోనైనా వైద్యులు, సిబ్బందిలో పరివర్తన వస్తుంది, వైద్యసేవలు మెరుగుపడతాయని ఆశించిన గిరిజన రోగులకు ఆశాభంగమే మిగిలింది. మరుసటి రోజునే వైద్యానికి వచ్చిన వారి పట్ల వైద్యులు, సిబ్బంది అదేతీరున వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ముఖ్యంగా రోగి చేయి పట్టుకుంటే ఏదో ఉపద్రవం వస్తుందన్నట్లు దూరంగానే ఉంచుతూ, వారు చెప్పిందేమిటో పూర్తిగా వినకుండా ఇష్టారాజ్యంగా వైద్యసేవలు అందిస్తున్న తీరు కొనసాగుతోందని అంటున్నారు. సూపరెంటిండెంట్‌పై చర్య తీసుకున్నంత మాత్రాన తమ తప్పేమీ లేదన్నట్లు ఉన్నవారు వ్యవహరిస్తున్నారని, దీనిపై సమగ్రదర్యాప్తు చేయడంతోపాటు నిరంతర పర్యవేక్షణతో వైద్యసేవలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని మన్యవాసులు కోరుతున్నారు.



చింతపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్‌కు విన్నవిస్తున్న కూటమి నేతలు (ఫైల్)



నిలిచిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు

- మరమ్మతుల నిమిత్తం విశాఖకు తరలింపు
- 4 నెలలైనా అందుబాటులోకి రాని వైనం

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సప్పర్ల, దారకొండ, సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (అంబులెన్స్) వాహనాలు మరమ్మతులకు గురి కావడంతో వాటి సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను సురక్షింతంగా ఇంటికి చేర్చడానికి ప్రభుత్వం పిహెచ్‌సిలకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ఏర్పాటు చేసింది. సప్పర్ల, దారకొండ, సీలేరు పిహెచ్‌సిల తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు నాలుగు నెలల క్రితం మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వాటిని మరమ్మతులు నిమిత్తం విశాఖపట్నం పంపించడం జరిగింది. నాలుగు నెలలైనా ఆ వాహనాలు నేటికీ ఆసుపత్రులకు చేరలేదు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు లేకపోవడంతో ఈ మూడు పిహెచ్‌సిల్లో కాన్పు అనంతరం తల్లీబిడ్డలను ఇంటికి తీసుకెళ్లడానికి నానా ఆగచాట్లు పడాల్సి వస్తోంది. గర్భిణులు ప్రసవం అనంతరం సమయానికి అందుబాటులో అంబులెన్స్ ఉంటే అందులో వారిని స్వగ్రామానికి పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ సమయానికి అంబులెన్స్ లేకపోతే గత్యంతరం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో మారుమూల గిరిజన గ్రామాల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన వారు వాహనాలకు డబ్బులు చెల్లించలేక వారి సొంత గ్రామానికి వెళ్లలేక, అక్కడ ఉండలేక అష్టకష్టాలు పడుతున్నారు. దీనిపై ఆయా పీహెచ్సీల పరిధిలోని గ్రామాల ప్రజలు సంబంధిత అధికారిని సంప్రదించగా వాహనాల మరమ్మతులు పూర్తయ్యాయని, వాటికి సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడం వలన వాహనాలు ఇవ్వలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎ పీఓ అభిషేక్ స్పందించి వాహనాల మరమ్మతులకు బిల్లులు చెల్లించి, మూడు పిహెచ్‌సిలకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు అందుబాటులో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ సేవా పురస్కారానికి ఎస్ఐ ఎంపిక

ప్రజాశక్తి-కూనవరం



ఎస్ఐ శ్రీనివాస్

ఉత్తమ సేవలు అందించే ఉద్యోగులకు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అందించే సేవా పురస్కారానికి కూనవరం ఎస్ఐ కె.శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఇటీవల గోదావరి, శబరి వరదలకు మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సేవలు అందించినందుకుగాను జిల్లా కలెక్టర్ ఉత్తమ సేవా పురస్కారానికి ఎస్ఐని ఎంపిక చేశారు. ఈ మేరకు ఎస్సై శ్రీనివాస్‌కు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, చింతూరు ఎఎస్‌పి రాహుల్ మీనా సందర్భానుసారంగా ఇచ్చిన ఆదేశాలను, సూచనలను పాటించడం, మండల ప్రజల సహకారం వల్ల ఈ అవార్డు వచ్చినట్లుగా చెప్పారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మాదక ద్రవ్యాల నిర్మూలనపై మారేడుమిల్లి సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నుండి విద్యార్థులతో స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం చేపట్టారు. నషా ముక్తి భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి మహమ్మారి తరిమికొట్టాలన్నారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసైపోతుందని, విద్యార్థి దశ నుండే ఈ వ్యసనాలకు అలవాటు పడడంతో వారి జీవితాలు నాశనమవుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో మాదక ద్రవ్యాల వినియోగదారుల సంఖ్య 6 కోట్లకు పైగా ఉందని, ఇందులో 10 నుండి 17ఏళ్ళ వయసు వారే అధికంగా ఉన్నారని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే ఈ రుగ్మతలను నివారించగలమన్న ఆలోచనతో ఉద్దేశంతో అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సర్పంచుల శిక్షణా తరగతులు


ప్రజాశక్తి-మారేడుమిల్లి



మాట్లాడుతున్న ఎంపిడిఒ వీర కిశోర్

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. ఎంపిపి సార్ల లలిత కుమారి, ఎంపిడిఒ ఎ.వీరకిశోర్ ఆధ్వర్యాన జరిగిన ఈ శిక్షణా తరగతుల్లో గ్రామ పంచాయితీల్లో వీధి దీపాల నిర్వహణ, కరంట్ బిల్లులు ఏ విధంగా చెల్లించాలి వంటి అంశాలపై విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న అవగాహన కల్పించారు. గ్రామ పరిపాలన అభివృద్ధిపై చర్చించి వారికి అవగాహన కల్పించారు. ఇఒపిఆర్‌డి పి.విజయ్‌కుమార్, ఎ.సురేఖ, ఎ.దేవిశ్రీ, శబరి, వి.కృష్ణప్రసాద్ ఎంఒటీలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఐఆర్‌డిపిఆర్ డిప్యూటీ డైరెక్టర్ కెవి.రమణారావు, డిఎల్‌డివో టి.కోటేశ్వరరావు, పరిపాలానాధికారి పి.జయంతి, ఏబీపీ కుమారి మనస్విని, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుట్టుగా రంగురాళ్ల తవ్వకాలు



సమగిరిలో రైతు పొలంలో రంగురాళ్ల కోసం వెతుకుతున్న స్థానికులు



తవ్వకాలతో దొరికిన రంగురాళ్లు

ప్రజాశక్తి- చింతపల్లి : మన్య ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాలు గోప్యంగా జోరుగా సాగుతున్నాయి. మైదాన ప్రాంతానికి చెందిన రంగురాళ్ల వ్యాపారులు మన్య ప్రాంతంలో మకాం వేసి కోట్లాది రూపాయల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఈ మధ్యకాలంలో మండలంలోని గొంది పాకల పంచాయతీ సమగిరి, ఎర్రవరం సమీప గ్రామాల మధ్య సమగిరి గ్రామస్తునికి చెందిన పంటపొలంలో రంగురాళ్ల తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రంగురాళ్ల తవ్వకాలకు నర్సీపట్నం, చింతపల్లి మండలం లోతుగెడ్డ జంక్షన్‌కు చెందిన పలువురు వ్యాపారస్తులు సమగిరి గ్రామంలో మకాం వేసి సమగిరి గ్రామస్తుల సహకారంతో రాత్రివేళల్లో గోప్యంగా తవ్వకాలు చేపడుతున్నట్టు, తవ్విన మట్టిని సమీప కాలువకు తీసుకెళ్లి కడిగి రంగురాళ్లను నర్సీపట్నం, లోతుగెడ్డ జంక్షన్‌కు చెందిన వ్యాపారస్తులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. రాత్రులు రంగురాళ్ల తవ్వకాలు నిర్వహించి పగటిపూట రంగురాళ్ల గోతులకు చుట్టుపక్కల చెట్ల కొమ్మలను నరికి మూత వేస్తున్నారు. ఇతర గ్రామాల నుంచి రంగురాళ్ల క్వారీ వద్దకు చేరుకుంటే ఇక్కడ ఎటువంటి తవ్వకాలు నిర్వహించడం లేదని గ్రామస్తుల చేత చెప్పిస్తున్నారు. రెండు వారాలుగా రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో గడిచిన వారం రోజులలో సుమారు రూ.కోటి వరకు వ్యాపారం జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. గడిచిన రెండు వారాలుగా సమగిరి గ్రామ సమీపంలో రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నా, అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

131 మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు



కాశీపట్నంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కాశీపట్నం సబ్ సెంటర్ సచివాలయంలో బుధవారం నిర్వహించిన వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్ విశాఖపట్నం, క్రాస్ కేన్సర్ హైదరాబాద్ చెందిన 20 మంది స్పెషలిస్ట్ వైద్య నిపుణుల ఆధ్వర్యంలో కేన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో వైద్య నిపుణులు డాక్టర్ మణికంఠ, డాక్టర్ గౌతమ్ ఉచిత కేన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా 131 మందికి వైద్యపరీక్షలు చేయగా, వారిలో 34 మందికి ఇసిజి, ఎక్సరే, మరో 30 మందికి మెమోగ్రఫీ, 24 మందికి పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. మిగతా రోగులకు సాదరణ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కేన్సర్‌పై ప్రజలఅవగాహన పెంచుకోవాలని, ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే సరైన వైద్యంలో కేన్సర్ మరణాలను నియంత్రించవచ్చని అవగాహన కల్పించారు. మనుష్యుల జీవనశైలి వల్లే కేన్సర్ వస్తుందని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ కనకేశ్వరరావు, ప్రవీణ్ స్థానిక వైద్య సిబ్బంది ఎంపిఎస్ఒ బి.నర్సింగరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు

పాడేరులో జెండా పండగ సందడి

- భారీ జాతీయ పతాకాలతో విద్యార్థుల ప్రదర్శన
- సిఎహెచ్ స్కూల్ గ్రౌండ్స్‌లో భారీ ఏర్పాట్లు



గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ప్రదర్శన

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందడి నెలకొంది. మూడు రోజులుగా పట్టణ వీధుల్లో భారీ జాతీయ పతాకాలతో పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులతో పాటు అధికారులు ఉపాధ్యాయులు ప్రదర్శనలో పాల్గొన్నారు. అందరిలోనూ జాతీయభావం వెల్లి విరిసింది. విద్యార్థుల్లో ఉత్తేజం నిండింది.

బుధవారం ఉదయం స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు 75 అడుగుల జాతీయ పతాకాన్ని పట్టుకొని పురవీధుల్లో బ్యాండ్ మేళంతో ప్రదర్శన నిర్వహించారు. జాతీయ గీతాలను ఆలపించారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సిఎహెచ్ స్కూల్ గ్రౌండ్స్‌లో అధికారికంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. సభా వేదికతో పాటు వివిధ శాఖల స్టాల్స్, శకటాలను సిద్ధ చేస్తున్నారు.

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎప్రాజెక్టు అధికారి అభిషేక్, జిల్లా ఎస్పి అమిత్‌బర్దర్, జాయింట్ కలెక్టర్ అభిషేక్, ఇతర అధికారులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉండడంతో దానికిఅనుగుణంగా స్వాతంత్ర్య వేడుకలకు సన్నాహాలు చేస్తున్నారు. పలు పాఠశాలల విద్యార్థులు తాము ప్రదర్శించబోయే కార్యక్రమాలకు సంబంధించి రిహార్సల్స్‌లో బిజీగా ఉన్నారు.

ఫోటో ప్రదర్శన ప్రారంభించిన జెసి, పిఒ

స్వాతంత్ర్య సంగ్రామ ఘట్టాలపై స్థానిక యూనియన్ బ్యాంకు అధికారులు బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ బుధవారం ప్రారంభించారు. ఫోటో ప్రదర్శనను తిలకించి ఎల్‌డిఎం నాయుడు, బ్యాంకు అధికారులను అభినందించారు.

జాతీయ జెండాల పంపిణీ

అధికారులకు ఉద్యోగులకు ఐటిడిఎ సమావేశ మందిరంలో పిఒ వి.అభిషేక్ జాతీయ జెండాలను పంపిణీ చేసారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలపైన జాతీయ జెండాను ఎగుర వేయాలని ఆదేశించారు. సంబంధిత పోటోలను అధికార పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే ఇంటింటా మువ్వెన్నల జెండాను ఎగుర వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ వివిఎస్ ప్రభాకర్, ఎస్‌డిసి వివిఎస్. శర్మ, గిరిజన సంక్షేమశాఖ ఇఇ డివిఆర్ఎం.రాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్ భాషా, ఐటిడిఎ పరిపాలనాధికారి ఎం.హేమలత, డిఆర్‌డిఎ పీడీవి.మురళి, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్. కుమార్, ఐటిడిఎ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

గిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యంలో హర్ ఘర్ తిరంగాకార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలల విద్యార్థులు పట్టణంలో భారీ జెండాతో ర్యాలీ నిర్వహించారు. తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల నుండి అంబేద్కర్ కూడలి వరకు 900 మీటర్ల భారీ జాతీయ జెండాతో దేశభక్తిని పెంపొందించే విధంగా విద్యార్థులు, అధికారులు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు.

జాయింట్ కలక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ్, జిల్లా ఎస్.పి. అమిత్ బర్దర్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, డిఇఒ పి.బ్రహ్మాజీ రావు, డిఆర్‌డిఎ పిడి పి. మురళి, ఎటిడబ్ల్యుఒలు ఎల్. రజని, వెంకటరమణ, సీఐ నవీన్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, పీడీలు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.




అధికారులకు జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న పిఓ



సెయింట్ ఆన్స్ విద్యార్థుల హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

గునలోవలో పాఠశాల ఏర్పాటు చేయరూ..!



ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న గునలోవ గ్రామస్తులు

ప్రజాశక్తి- పెదబయలు : ఆంధ్రాఒడిశా సరిహద్దులోని పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ గునలోవ గ్రామంలో ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఆ గ్రామస్తులు ఎంపిడిఒ ఎల్. పూర్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ముందుగా వైస్ ఎంపిపి పాంగి సోనే నాయకత్వంలో ఇంజరి మాజీ సర్పంచ్ పూజారి సత్యారావు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి, ఎంపిడిఒకు విన్నవించారు.

ఈ సందర్భగా గునలోవ గ్రామంలో వెనకబడిన తరగతి పిటిజి, కోదు ఉపకులానికి చెందిన సరిగా తెలుగు మాట్లాడలేని తెగకు చెందిన గిరిజనులు జీవిస్తున్నారని, ప్రస్తుతం గ్రామంలో 65 మంది బడిఈడు పిల్లలున్నా గ్రామ సమీపంలో పాఠశాల లేకపోవడంతో చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. ఇక గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో వైద్యసేవలకు డోలిమోతలే శరణ్యమని ఆవేదన వెలిబుచ్చారు. గ్రామం జి మాడుగుల, లేదా పాడేరుకు నడిచి వెళ్లాల్సి ఉందని వాపోయారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, ఇతర అధికారులు, గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు దృష్టిపెట్టి గ్రామంలో పాఠశాల మంజూరుతోపాటు రోడ్డు సదుపాయం, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. దీనిపై ఎంపిడిఒ పూర్ణయ్య స్పందిస్తూ గున్నకోట గ్రామస్తుల సమస్యలను మండల విద్యాశాఖాధికారితోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీనిచ్చారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, గున్నకోటలో పాఠశాల ఏర్పాటు, ఇతర సమస్యలపై విన్నవించి, పోలీసులు చొరవ చూపాలని వేడుకున్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేయండి

ప్రజాశక్తి- పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు రంపచోడవరం డివిజన్లలోని 22 మండలాల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోట్స్ పుస్తకాలు పంపిణీ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎపిటిఎఫ్ అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు అంబిడి శ్యాం సుందరం విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని మూడువేల ప్రాథమిక పాఠశాలల్లో సుమారు లక్ష మంది విద్యార్థులు నోట్స్ పుస్తకాలు పంపిణీ జరగక ఎదుర్కొంటున్న ఇబ్బందులపై విద్యాశాఖ మంత్రికి బుధవారం ఒక లేఖ ద్వారా లిఖితపూర్వకంగా విన్నవించారు.. ప్రభుత్వం ప్రైమరీ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు మాత్రమే పంపిణీ చేస్తున్నారని, నోట్స్ పుస్తకాలు పంపిణీ జరగడం లేదన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరిస్థితి, అభ్యర్థన మేరకు నోటుపుస్తకాలను ప్రభుత్వపరంగా అందజేసి వారికి అండగా నిలవాలని కోరారు.

అధ్వానంగా చౌడవాడ రహదారి

అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని యంత్రాంగం

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో చౌడవాడ గ్రామ ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రజలు వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, రహదారి సమస్యపై గ్రామస్తులు, నాయకులు పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఎవరు పట్టించుకోలేదు, గ్రామమంతా ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తూ ప్రజలు ఇబ్బందులకు గురిచేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా స్పందించలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా ఎమ్మెల్యే స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. విశాఖకు అనకాపల్లికి వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో ఈ రహదారి నిత్యం రద్దీగానే ఉంటుందని, వాహనదారులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

స్పీడ్ బ్రేకర్‌తో చిక్కులు!

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల కేంద్రంలో మండల పరిషత్ ఎదురుగా ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదానికి గురై ప్రభుత్వ రెవెన్యూ ఉద్యోగి తీవ్రగాయాల పాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలివి. మండల పరిషత్ ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు నిలిచిపోయిఉండడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఇటీవల మండల పరిషత్ అధికారులు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేశారు. అయితే స్పీడ్‌బ్రేకర్ వద్ద బుధవారం కురిసిన వర్షానికి రోడ్డుపై నీళ్లుచేరాయి. కైలాసపట్నం గ్రామానికి చెందిన ప్రభుత్వ రెవెన్యూ ఉద్యోగి సన్యాసిరాజు ద్విచక్ర వాహనంపై వెళ్తూ, స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో సన్యాసిరాజుకు ఎడమకంటిపై తీవ్రగాయమైంది. బాధితుడిని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. స్థానిక వైద్యులు, సిబ్బంది సేవలు అందించారు. అయితే స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలుమార్లు స్థానికులు, నాయకులు సైతం అధికారులకు మొరపెట్టుకున్నను పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రమాదానికి అదే కారణమంటున్నారు. సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు యోచిస్తున్నారు.

పతకాలు సాధించిన కిక్ బాక్సర్లకు అభినందన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : కిక్ బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నం క్రీడాకారులు పతకాలు సాధించారు. రాజమండ్రిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2024లో స్థానిక ఆర్బీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన 18 మంది పాల్గొనగా 12 మంది క్రీడాకారులు విజయం సాధించి పతకాలు గెలుచుకున్నారు. విజేతలైన క్రీడాకారులకు ఆర్డీఓ హెచ్వి.జయరాం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆర్బి మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ చైర్మన్ వెలగ నారాయణరావు, వైస్ చైర్మన్ పీవీఎం.నాగజ్యోతి, వ్యవస్థాపకులు ఆర్బి ప్రసాద పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ నాగజ్యోతి మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ముఖ్యంగా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా ఆత్మ రక్షణ, ధైర్య సాహసాలు అలవడతాయని తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి తదుపరి జరిగే పోటీలలో కూడా పాల్గొని నర్సీపట్నంకు మరెన్నో బహుమతులు తీసుకురావాలని ఆశిస్తూ వారిని ఉత్సాహపరిచారు.

భారీ వాహన రాకపోకలతో..

ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్‌కు ఇక్కట్లు

ప్రజాశక్తి-అనంతగిరి : అనంతగిరి, అరకు ఘాట్ రోడ్డులో భారీ వాహనాలు, గూడ్స్ లారీల రాకపోకలతో ట్రాఫిక్‌కు పదేపదే అంతరాయం కలుగుతోంది. నిండా మలుపులతో కూడిన ఘాట్ రోడ్డులో పొడవైన భారీ వాహనాల సాఫీగా ముందుకు సాగని పరిస్థితుల్లో ఎక్కడికక్కడే అడ్డుకుపోవడంతో ఇక్కట్లు తప్పడంలేదు. ఏజెన్సీలోనిపర్యాటక అందాలను తిలకించేందుకు దేశవిదేశాల నుంచి వచ్చే పర్యాటకులు దీంతో అవస్థలు పడుతున్నారు. తాజాగా బుధవారం నాగాలాండ్ ప్రాంతానికి చెందిన భారీ వాహనం ఆంధ్ర నుండి ఒడిశా సరిహద్దు మీదుగా వెళ్తున్న క్రమంలో కాశీపట్నం ప్రధాన రహదారి వద్ద భారీవృక్షం అడ్డుపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శివలింపురం మొదలుకొని తైడ, డముకు, ములియగుడ, అనంతగిరి మీదుగా బీసుపురం, సుంకరమెట్ట, అరకు వరకు సుమారు 60 కిలోమీటర్ల పైగా మలుపులతో కూడిన ఘాట్ రోడ్డులో ఇది ప్రయాణం సాగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇలాంటి వాహనాల వల్ల ఇంకెంత ఇబ్బందులులోనని స్థానికులు అంటున్నారు.



కాశీపురం వద్ద చెట్టుకు తగలడంతో నిలిచిన భారీ వాహనం

గసభలో ఆటల పోటీలు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సురేష్

ప్రజాశక్తి- డుంబ్రిగుడ : స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని గసభ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత ఆధ్వర్యంలో స్థానిక యువతకు పంచాయతీ కేంద్రంలో బుధవారం వాలీబాల్, అలాగే పాఠశాల విద్యార్థులకు రన్నింగ్ పోటీలను నిర్వహించారు.ఈ ఆటల పోటీలను గసభ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, వార్డు సభ్యులు పి సత్యనారాయణ, దొడక రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందన్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని గంజాయి, నాటుసారా వంటి మత్తు పదార్థాల జోలికి పోకుండా ఉండాలని కోరారు .పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఆగస్టు15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సర్పంచ్,వార్డుమెంబర్లతో ఆర్థిక బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు అప్పారావు, కృష్ణ, గణేష్, లోవరాజు, బలరాం, క్రీడాకారులు పాల్గొన్నారు.

చుట్టుగెడ్డకు తారురోడ్డు నిర్మించరూ..!

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - మాడుగుల: మండలంలో శంకరం పంచాయతీ శివారు చుట్టుగెడ్డ గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మించాలని కోరుతూ బుధవారం ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామానికి ఉన్న గ్రావెల్ రోడ్డు బురద కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణంపాలెం తారు రోడ్డు నుంచి గ్రావెల్ రోడ్డు మీదుగా చుట్టు గెడ్డ గ్రామాన్ని సందర్శించిన నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజన సంఘం బృందం, ముందుగా గిరిజనులతో మాట్లాడివారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తారు రోడ్డు నిర్మాణం చేయాలని నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ కృష్ణంపాలెం తారురోడ్డు నుండి చుట్టుగెడ్డ వరకు గ్రావెల్ రోడ్డు వేశారని, అయితే చుట్టుగెడ్డ నుండి కూర్మనాథపురం వరకు తారు రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేసారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చుట్టుగెడ్డ వరకు ఉన్న గ్రావెల్ రోడ్డు గుంతలు బురదమయం కావడంతో కృష్ణం పాలెం నుంచి కూర్మనాథపురం వెళ్లాలంటే చుట్టుగెడ్డ ప్రజలు కాశీపురం మీదుగా కోడూరు, చినకూర్మనాథపురం తారు రోడ్డు నుండి ద్వారకానగర్. కూర్మనాథపురం. వెళ్ళవలసి వస్తుందని, దీంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తంచేసారు. అత్యవసర వైద్యం, నిత్యావసరాలకు, అలాగే విద్య, వైద్యం ఇతరత్రా అవసరాలకు చుట్టుగెడ్డ గిరిజనం పడుతున్న ఇబ్బందులపై అనేకసార్లు అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా స్పందన లేదని వాపోయారు. ఇప్పటికైనా చుట్టుగెడ్డ గిరిజనంపై నిర్లక్ష్యం వీడి తారురోడ్డు నిర్మాణంతోపాటుఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జనపరెడ్డి కొండలరావు, నెల్లూరు కృష్ణ, అల్లంగి చిన్నారావు, కిల్లి బాలరాజమ్మ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పాము కాటుతో గిరిజనుడు మృతి

ప్రజాశక్తి-చింతపల్లి: ఇంట్లో నిద్రిస్తుండగా, రాత్రి వేళ పాముకాటుకు గురై గిరిజనుడు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడు బుట్టారి గోవిందరావు భార్య అన్నపూర్ణ తెలిపిన వివరాలివి. మండలంలోని బలపం పంచాయతీ, జిగదినప గ్రామానికి చెందిన బుట్టారి గోవిందరావు మంగళవారం వ్యవసాయ పనులు ముగించుకొని రాత్రి కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఇంట్లో చొరబడిన విష సర్పం గోవిందరావు భర్త కాలుపై కాటేసింది. దీన్ని గమనించిన గోవిందరావు విషయాన్ని భార్యకు చెప్పడంతో ఆమె గ్రామస్తుల సాయంతో సొంత వాహనంతో హుటాహుటిన కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఆరోగ్యం విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య సేవల కోసం పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో జి మాడుగుల సమీపంలో తన భర్త మృతి చెందాడని మృతుని భార్య అన్నపూర్ణ తెలిపింది. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారన్నారు. ఇంటి పెద్దదిక్కు మరణంతో గిరిజన కుటుంబం దిక్కులేనిదైంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

160 కిలోల గంజాయితో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-పెదబయలు : పెదబయలు మండలం కొరవంగి పంచాయితీ వల్లంగిపుట్టు గ్రామంలో ఇంటి వద్ద రెండేళ్ల క్రితం పండించిన గంజాయిని నిల్వ ఉంచినట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు జిల్లా ఎస్పి ఆదేశాలతో జి.మాడుగుల సిఐ ఎస్,.రమేష్ ఆదేశాలతో వల్లంగిపుట్టు గ్రామంలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో 160కిలలో గంజాయి పట్టుబడిందని పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో వల్లంగి పుట్టు గ్రామంలో గజ్జంగి గున్నయ్య అను వ్యక్తి ఇంట్లో 160 కేజీలు గంజాయి పట్టుబడగా, దీనికి సంబంధించి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గజ్జంగి గున్నయ్య, గజ్జంగి బాలయ్య దొర, తిరుపతిరావులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.గంజాయి అక్రమ రవాణా, నిల్వలపై జిల్లా ఎస్‌పి ఆదేశాలతో గ్రామాల్లో స్నైపర్ డాగ్‌తో తనిఖీలు చేపడుతున్నామని, గంజాయితో పట్టుబడితే కేసులు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : మాదక ద్రవ్యాలను నిరోధించేందుకు, యువతను అందులో భాగస్వామ్యులను చేయాలనే ఉద్దేశ్యంతో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో బుధవారం నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్, డిగ్రీ విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహిచారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ హాజరై ఈ పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో జడ్జి షియాజ్‌ఖాన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో సమాజం నాశనం అవుతుందన్నారు. యువత గంజాయి, సిగరెట్‌తో మొదలై హెరాయిన్, బ్రౌన్‌సుగర్, కొకైన్ వంటి మాదవ ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యతును చేతులారా పాడుచేసుకుంటున్నారని కుటుంబాలకు, సమాజానికి భారంగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాజు, ఇతర సిబ్బంది వారిని అభినందించారు.

ఆరిలోవ టేకు ప్లాంటేషన్ పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఉన్న టేక్ ప్లాంటేషన్‌ను బుధవారం విశాఖపట్నం రీసెర్చ్ సెంటర్ రేంజ్ అధికారిని దీప్తి సందర్శించారు. 2006లో నాటిన టేకు ప్లాంటేషన్ ఎదుగుదలపై పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. అప్పట్లో ఐదు రకాలైన టేకు స్టంపులను ఈ ప్లాంటేషన్‌లో నాటడం జరిగిందన్నారు. నాటిన ఐదు రకాలలో ఎంత మేర పెరిగిందో పరిశీలించి వాటిలో ఎదుగుదల కలిగిన టేక్ దుంపలను కొత్త ప్లాంటేషన్‌లో వేసే విధంగా పరిశోధనలు చేస్తున్నామన్నారు. పెడిమికొండ ప్రాంతంలో మరో ప్లాంటేషన్ పరిశీలిస్తామని తెలిపారు. రీసెర్చ్ సెంటర్ డిఆర్ఒ పార్వతీశం,పాల్గొన్నారు.

దేశభక్తిని చాటుకున్న సూక్ష్మ కళాకారుడు

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, కార్పెంటర్ దార్ల రవి తన సూక్ష్మ కళతో దేశభక్తిని చాటుకున్నాడు.స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని చెక్కతో అశోక చక్రం చెక్కి అందరినీ అబ్బురపరిచాడు.



సీలేరులో ప్రదర్శన చేపట్టిన విద్యార్థులు, పోలీసులు

ఉత్తేజంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలు

ప్రజాశక్తి -సీలేరు : జీకే.వీధి మండలం సీలేరులో బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. త్రివర్ణ పతాకాన్ని విద్యార్థులు, పోలీసులు చేతపట్టి స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డు, రామాలయం మీదుగా మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టారు. భారత్ మాతాకీ జై అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ ఇన్స్పెక్టర్ సుభాష్ కేడి మాట్లాడుతూ త్రివర్ణ పతాకాన్ని ప్రతి ఇంటింటా ఎగరేయాలని కోరారు. కార్యక్రమంలో సిఆర్పిఎఫ్, సివిల్, గ్రేహౌండ్స్ పోలీసులు, స్థానిక పీహెచ్సీ వైద్యాధికారి సౌమ్య, హెచ్ఎస్ త్రినాథ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శంకర్రావు, అధ్యాపకులు శ్రీను, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం నిర్వహించారు. విద్యార్థులు, ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని నింపటానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కళాశాలలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లిశేఖర్, అధ్యాపకులు జి.వెంకట్రావు, ఆర్‌సిహెచ్.నాగేశ్వరరావు, వై.పద్మ, కె.శైలజ, కె.శకుంతల, కె.శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, సిహెచ్.రాజబాబు, ఎన్‌విివిఎస్ఎన్.మూర్తి, ఎన్.రమేష్, ఆర్.మౌనిక, జి.సాయికుమార్, పి.అలివేలు, బి.సంఘం నాయుడు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జెకెసి ట్రస్టు ఆధ్వర్యాన తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి - చింతూరు : మండలంలోని వీరాపురం గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీటి బోరును ఏర్పాటు చేశారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ చైర్మన్‌గా ఉన్న జెకెసి ట్రస్ట్ ద్వారా రూ.70 వేలుతో ఈ తాగునీటి బోరును వీరాపురం గ్రామంలో ఏర్పాటు చేశారు. దీనిని బుధవారం జమాల్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి కారణంగా ఇబ్బందులు పడుతున్నారని తనకు దరఖాస్తు చేసుకోగా, బోరు రిగ్గును తెప్పించి హ్యాండిల్ బోరును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెకెసి ట్రస్టు సభ్యులు ఎస్కే.షాజహాన్, రియాజ్, నటరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఉక్కు'ను ప్రైవేటుపరం కానివ్వం

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానిచ్చేదిలేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు, డి.ఆదినారాయణ, స్టీల్ ఒబిసి అసోసియేషన్ అధ్యక్షులు బి.అప్పారావు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1280వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఒబిసి అసోసియేషన్‌కు చెందిన కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి రోజురోజుకూ తగ్గిపోతుండటంతో కార్మికుల్లో ఆందోళన రేగుతోందన్నారు.

కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం కావాలనే ఉత్పత్తిని తగ్గించి స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల వైపు నడిపిస్తున్నాయన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా ఉద్యమాలకు మరింత పదును పెట్టనున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉక్కు పరిరక్షణ పోరాటం జరుగుతోందని, అన్ని రంగాల కార్మికులు, ప్రజలు, నాయకులు తరలివచ్చి కేంద్ర బిజెపి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

మందకొడిగా వరి సాగు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో వరిసాగు మందకొడిగా సాగుతోంది. వర్షాలు సకాలంలో సరిపడినంత సమృద్ధిగా కురవకపోవడం, వున్న కొద్దిపాటి సాగునీటి వనరులను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతో రైతుకు ఏటా ఖరీఫ్‌లో సాగు కష్టాలు తప్పడంలేదు. జిల్లాలోని 24 మండలాల్లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,32,802 ఎకరాలకు 32,507 (24.47 శాతం) ఎకరాల్లో వరి సాగు నమోదైంది. ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు 13 వరకు 450.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సివుండగా 370.3 మిల్లీమీటర్లు కురిసింది. వర్షాలు నిలకడగా పడకపోవడంతో వరి సాగు ముందుకు వెళ్లడంలేదు. జలాశయాలు, కాలువల మరమ్మతులు కొన్నేళ్లుగా పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో వాటి పరిధిలో కూడా వరి సాగు సరిగాలేదు. అనకాపల్లి వ్యవసాయశాఖ డివిజన్‌లో 16,267 ఎకరాలకు 902 (5.54 శాతం) ఎకరాల్లో ఉడుపులు జరిగాయి. యలమంచిలి డివిజన్‌లో 20,982 ఎకరాలకు 2,255 (10.74 శాతం) ఎకరాల్లో వరి సాగు నమోదైంది. చోడవరం డివిజన్‌లో 32,680 ఎకరాలకు 12,015 (36.76 శాతం) ఎకరాలు, పాయకరావుపేట డివిజన్‌లో 34,130 ఎకరాలకు 9,330 (27.33 శాతం) ఎకరాలు, నర్సీపట్నం డివిజన్‌లో 28,742 ఎకరాలకు 8005 (27.85 శాతం) ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు.

జలాశయాల కిందా అదే పరిస్థితి

1.32 లక్షలకు 32 వేల ఎకరాల్లో పంట నమోదు

జలాశయాల కింద భూముల్లోనూ వరి సాగు అంతంతమాత్రంగానేవుంది. 32,689 ఎకరాలకు సాగునీరందించే తాండవ జలాశయ నీటిని సాంకేతిక సమస్యలతో ఇంకా విడుదల చేయలేదు. దీంతో దీనికిందనున్న ఆయకట్టులో వరి సాగు నమోదుకాలేదు. రైవాడ కింద 15,344 ఎకరాలకు 500 ఎకరాలు, కోనాం కింద 12,276 ఎకరాలకు వెయ్యి ఎకరాలు, పెద్దేరు జలాశయం కింద 15,105 ఎకరాలకు 878 ఎకరాల్లో మాత్రమే వరి సాగైంది. వరి సాగైన ప్రాంతాల్లో జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.మోహనరావు తన సిబ్బందితో కలిసి పంటసాగులో తీసుకోవాల్సిన మెలకువలపై రైతుకు సూచనలు ఇస్తున్నారు. కాలపరిమితిలోపు వరి సాగు పూర్తవుతుందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు.

జిల్లా గ్రంథాలయ పునర్నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహారాణిపేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరం స్థలంలో వెంటనే గ్రంథాలయ పునర్నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా గ్రంథాలయ పునర్నిర్మాణం కోసం పౌర గ్రంథాలయాల సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత స్టేట్ లైబ్రరీ ఒకటి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండాలన్నారు. అందుకు తగిన స్థలం, తగిన ప్రాంతం, తగినన్ని నిధులు విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థకు ఉన్నాయని తెలిపారు. దొండపర్తిలోని రీజనల్ ప్రభుత్వ గ్రంథాలయానికి మద్రిపాలెం వద్ద స్థలం ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ ఏనాడో నిర్ణయించారని, అయితే ఆ స్థలం తీసుకొని అక్కడ రీజనల్ గ్రంథాలయం నిర్మించే ఏర్పాట్లు ఏళ్లు గడుస్తున్నా జరగలేదని అన్నారు. ఇక మహారాణిపేట ప్రాంతంలో ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలాన్ని గతంలో ఒక నాయకుడు ఆక్రమించే ప్రయత్నం చేయగా పౌర గ్రంథాలయాల సేవా సమితి ద్వారా నిరసనలు, ఆందోళనలను నిర్వహించడం, అప్పటిలో ఎమ్మెల్సీగా ఉన్న తాను శాసన మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో పలు పరిణామాల నేపథ్యంలో గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరం స్థలం జిల్లా గ్రంథాలయ సంస్థకు దఖలుపడిందన్నారు. ప్రస్తుతం ఆ స్థలం ఖాళీగా ఉందన్నారు. దీని నిర్మాణానికి రూ.30 కోట్లు సరిపోతాయని తెలిపారు. జివిఎంసి వద్ద గ్రంథాలయం సెస్సు పేరుతో ఇళ్ల పన్నుల నుంచి 8 శాతంగా వసూలు చేసిన సుమారు రూ.300 కోట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. స్థలం సిద్ధం, అవసరమైన నిధులు సిద్ధం.. ఈ నేపథ్యంలో ప్రభుత్వ చిత్తశుద్ధి ఉంటే వెంటనే భవన నిర్మాణం చేపట్టవచ్చునన్నారు. కానీ అలా జరగడం లేదన్నారు. 2010 నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలం వివాదం కొనసాగుతోందని, రాష్ట్రంలో రెండు ప్రభుత్వాలు మారిపోయాయని తెలిపారు. కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఇప్పటికైనా చొరవ తీసుకోవాలని కోరారు. గ్రంథాలయం లేకపోతే జరిగే నష్టం వారికి తెలియదా ? అని ప్రశ్నించారు. గ్రంథాలయ భవన నిర్మాణం కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పౌర గ్రంథాయాల సేవా సమితి అధ్యక్షులు బిఎల్.నారాయణ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ భవన స్థలాన్ని కాపాడుకునేందుకు జరిగిన పోరాట చరిత్రను వివరించారు. .సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణం కోసం అవసరమైన నిధుల కోసం జివిఎంసిలో తాము పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిపిపి పద్ధతిలో ప్రభుత్వ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూస్తోందన్నారు. ఎయు మాజీ ప్రొఫెసర్ సుబ్బారాయుడు మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా సాధించుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలం ప్రయివేటు వ్యక్తులపాలు కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేసే ఆలోచన మంచిది కాదన్నారు. తమ వంటి పేద తరగతికి చెందిన ఎందరో గ్రంథాలయాలపై ఆధారపడి ఉన్నత చదువులు చదువుకొని, కలెక్టర్లు వగైరా ఉన్నత ఉద్యోగాలను సాధించగలిగారని, అటువంటి వారిలో తాను కూడా ఒకడినని చెప్పారు. సమావేశంలో సేవా సమితి కోశాధికారి పి.మల్లేశ్వరరావు, ఎయు మాజీ ప్రొఫెసర్ ధనరాజు, సిహెచ్‌విఎల్ఎన్. శాస్త్రి, డాక్టర్ కె.రమాప్రభ, లక్ష్మీపతి, పి.మణి, ఎన్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ



ముత్తయ్య భౌతికకాయం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

ముత్తయ్యకు సిపిఎం నేతల నివాళి

ప్రజాశక్తి - విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి గుర్రంపేట గ్రామానికి చెందిన సిపిఎం సభ్యుడు కారం ముత్తయ్య కొంతకాలంగా డయాలసిస్ బాధపడుతూ బుధవారం మృతి చెందారు. దీంతో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఇతర నాయకులు గురువారం ముత్తయ్య మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. మృతుని కుటుంబానికి సంతాపం తెలియజేసి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ముత్తయ్య సిపిఎం సభ్యుడుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పని చేశారని, ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని తెలిపారు. ముత్తయ్య సేవలు మరువలేని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వడ్లది రమేష్, కారం లక్ష్మయ్య, కారం గోపి తదితరులు పాల్గొన్నారు.

విసిసి ఆధ్వర్యాన బహుముఖ పోటీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశాఖ జిల్లాలోని పిల్లలకు వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో బుధవారం ట్యూషన్ సెంటర్లలో డ్రాయింగ్, క్విజ్, వ్యాస రచన, ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు జాతీయ జెండా, దేశభక్తి, స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధించిన అంశాలపై ఈ పోటీలు సాగాయి. పోటీలలో పాల్గొన్న వారికి బహుమతి ప్రదానం గురువారం జరుగుతుందని కన్వీనర్ కె.సుశీల మీడియాకు తెలిపారు. ఆసరా ఛారిటబుల్ సొసైటీ, విశ్వ మానవ సంక్షేమ సంఘం సహకారంతో పోటీలు నిర్వహించామన్నారు. భీమిలి, మధురవాడ, ఆరిలోవ, మద్దిలపాలెం, జగదాంబ, కంచరపాలెం, గోపాలపట్నం, గాజువాక, మల్కాపురం, ఉక్కునగరం జోన్లలో ఈ పోటీలు సాగాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో శైలజ, నీలవేణి, సంధ్య, అప్పలకొండ, అనసూయాదేవి, కృష్ణవేణి, యామిని, దివ్య, దీప్తి, సుమ, శిరీష, కల్యాణి, సతీష్, గణేష్, సంతోషి పాల్గొన్నారు.

17న మిలీనియం క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ మరో భారీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టింది. ఈ నెల 17న భార్గో ఇన్నోవేషన్స్ అనే ప్రముఖ సంస్థతో కలిసి డ్రైవ్ నిర్వహించనున్నట్టు ఆ సంస్థ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం పోస్టర్ అవిష్కరించారు. స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోసం ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. మాంద్యం రోజుల్లో కూడా ప్లేస్‌మెంట్ చూపించడం, విద్యార్థులను ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. 17వ తేదీ నాటి డ్రైవ్‌లో కనీసం 50 ప్లేస్‌మెంట్లు కల్పించే ధ్యేయంతో పనిచేస్తున్నామన్నారు. మెకానికల్ విద్యార్థుల కోసం గత వారం డ్రైవ్ నిర్వహించగా 97మంది విద్యార్థులు ప్లేస్మెంట్ పొందారని గుర్తు చేశారు. 24 ఏళ్ల నుంచి తమ సంస్థ జాబ్ మేళాలు/క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ వస్తోందని, అలా ఇప్పటి వరకు 1.5 లక్షల మంది ప్లేస్‌మెంట్ పొందారని అన్నారు. 2023- 2024 మధ్య 60 శాతం బీటెక్ (సీఎస్ఈ), సీ పైథాన్, డాట్.నెట్ ఫ్రేమ్ వర్క్, హెచ్‌టిఎంఎల్, సీఎస్ఎస్/జావా స్క్రిప్ట్ కోర్సుల్లో నైపుణ్యం ఉన్న ఇతర బీటెక్ గ్రాడ్యుయేట్లు ఈ డ్రైవ్‌కు అర్హులని మిలీనియం హెచ్‌ఆర్ మేనేజర్ బి.రమ్యశ్రీ అన్నారు. విశాఖ పరిధిలో భార్గో సంస్థ ఒక ప్రముఖ ఐటీ, బిజినెస్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న వారంతా 17న నేరుగా మిలీనియం క్యాంపస్‌కు రావచ్చని, లేదా hr@millenniumsoftsol.comకు తమ రెజ్యూమ్‌ను పంపవచ్చని తెలిపారు.